క్లుప్తంగా

సత్యదేవుని రథానికి ఘన స్వాగతం



వీరేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన అన్నవరం ప్రచార రథం

ఐ.పోలవరం: హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా కాకినాడ జిల్లా అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి దివ్య రథానికి మండలంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. అన్నవరం సత్యదేవుని రథం ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయానికి తరలివచ్చింది. ప్రచార రథానికి ఆలయ అర్చకులు, దేవస్థానం ఉద్యోగులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రథంలోని స్వామి, అమ్మవార్లను దేవాలయానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రూ.లక్ష ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

అల్లవరం: కోడూరుపాడులో నిమోనియా వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాసంశెట్టి ప్రసాద్ కుమారుడు వాసంశెట్టి షియాష్ వైద్య ఖర్చుల నిమిత్తం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఉదారత చాటుకున్నారు. సభ్యులు సమకూర్చిన రూ.65 వేలు, జీఎంకే చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ గుత్తుల మీరాకుమార్ రూ.20 వేలు, చెల్లుబోయిన శ్రీనువాసరావు రూ.15 వేలు మొత్తంగా రూ.లక్ష బాధిత కుటుంబానికి కోడూరుపాడులో బుధవారం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన దాతలకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, గుత్తుల చిరంజీవి, గొవ్వాల రాజేష్, అధిక సంఖ్యలో శెట్టిబలిజ సంఘీయులు పాల్గొన్నారు.

భద్రతపై ప్రభుత్వ పెన్షనర్లకు అవగాహన

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖకు చెందిన పెన్షనర్లకు స్థానిక ఏవీఆర్ నగర్‌లోని జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో హైదరాబాద్ హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో భద్రత, డిజిటల్ రంగం, సైబర్ మోసాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి శ్యామ్ తొలుత పెన్షనర్లకు భద్రతపై అవగాహన కల్పించారు. విశ్రాంతి ఉద్యోగులకు భద్రత ఎంత ముఖ్యమో వివరించారు. అనంతరం డిజిటల్ రంగంపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లలో వచ్చే పలు రకాల యాప్‌ల గురించి వివరిస్తూ ఏఏ యాప్‌లను ఓపెన్ చేయాలి, ఎలాంటివి ఓపెన్ చేయకూడదన్న భద్రతను తెలియజేశారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా రక్షణ పొందాలో వివరించారు. ఆన్‌లైన్ పేరుతో జరిగే సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, చైతన్య పూరితమైన వీడియోలు చూపించి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయి అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, అసోసియేషన్ సభ్యురాలు మెహబూబ్ షహీరా తదితరులు పాల్గొన్నారు.

కొత్త గురువులకు సర్వీస్ రిజిస్టర్ అందజేత

ఐ.పోలవరం: మండలంలోని పశువులంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ సర్వీస్ రిజిస్టర్‌లను అందజేసింది. పాఠశాలలో డీఎస్సీ-2025లో నియమితులైన పీడీలు బుధవారం విధులలో చేరారు. వీరికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మునేశ్వరరావు సర్వీస్ రిజిస్టర్‌లను అందజేశారు. గౌరవనీయమైన ఉపాధ్యాయ వృత్తికి అంకిత భావంతో పనిచేసి మరింత గౌరవం పెంచాలని ఆయన కోరారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మడికి నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రం అందజేత

అమలాపురం టౌన్: విజయవాడ దివ్యాంగుల కమిషనర్ కార్యాలయంలో పీడబ్ల్యూడీ ఫెడరేషన్ (దివ్యాంగుల సమూహం) ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రం అందించినట్లు జిల్లాకు చెందిన దివ్యాంగుల సమూహం నాయకుడు నిమ్మకాయల సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయాన్ని కమిషనర్‌కు వివరించామని పేర్కొన్నారు. బ్యాక్ లాగ్‌ల పోస్టుల విషయాన్ని వివరించామన్నారు. దివ్యాంగుల గృహ నిర్మాణాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. పీడబ్ల్యూడీ ఫెడరేషన్ అధ్యక్షుడు కానూరు శంకరరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కొండలరావుతో కలిసి జిల్లా దివ్యాంగుల సమస్యలను కూడా కమిషనర్‌కు వివరించామని సురేష్ పేర్కొన్నారు. తొలుత పీడబ్ల్యూడీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు విజయవాడలో సమావేశమై సమస్యలపై చర్చించారు.

మాయదారి మలుపు!

- రోడ్డు దాటాలంటేనే హడల్
- ప్రమాదకర మలుపుతో ప్రజలు ఆందోళన
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

ముమ్మిడివరం: ఆ రోడ్డు దాటాలంటే భయం.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.. రహదారి దాటాలంటే గుండె దడ. ఏ వాహనం ఎటువైపు నుంచి దూసుకొస్తుందో తెలియని అయోమయం. ఇదీ కొత్త కాలువ సెంటర్ పరిస్థితి. మండలంలోని నాలుగు గ్రామాల కూడలిగా ఉన్న కొత్త కాలువ సెంటర్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ 216 జాతీయ రహదారికి ప్రమాదకర మలుపు ఉండటంతో పాటు గాడిలంక గ్రామానికి వెళ్లే జెడ్పీ రహదారి, అన్నంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి, మర్లపాలెం, చినకొత్తలంక గ్రామానికి వెళ్లే కెనాల్ రోడ్డు ఈ ప్రాంతంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జాతీయ రహదారిని దాటడం అంటే వాహనచోదకులు, పాదాచారులు హడలిపోతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గ్రామాలకు వెళ్లే అప్రోచ్ రోడ్డులను తొలగించారు. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఎటువంటి అప్రోచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారిపై భారీ వాహనాలు వేగాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టకపోవడం, అనుక్షణం వాహనాలు తిరగడంతో ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు హడలిపోతున్నారు.



జాతీయ రహదారి అప్రోచ్ లేక ప్రమాదకరంగా కొత్తకాలువ సెంటర్ మలుపు

తరచూ ప్రమాదాలు

మండల కేంద్రమైన ముమ్మిడివరం వెళ్లాలంటే గాడిలంక, మర్లపాలెం, చినకొత్తలంక, అన్నంపల్లి, కొమానపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ ప్రాంతానికి చేరుకుంటారు. ఇక్కడ బస్టాప్ కూడా ఉండటం వల్ల తరచు రోడ్డుపై వాహనాలు ఆగి ప్రయాణికులను చేరవేస్తుంటాయి. రాకపోకలు సాగించే నేపథ్యంలో జాతీయ రహదారిని దాటుతుంటారు. ఇక్కడే ప్రమాదకర మలుపు ఉండటంతో రహదారిపై వచ్చే వాహనాలు గుర్తించే పరిస్థితి లేక రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కూడలిలో రెండు వైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. హైవే అధికారులు జీబ్రా లైన్లు, వేగం అదుపును తెలియజేసే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా రాత్రి వేళ చీకటిగా ఉండటం వల్ల రోడ్డును దాటడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. సుమారు 5వేల జనాభా కలిగిన నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం రోడ్డును దాటుతుంటారు. ఈ కూడలి ప్రాంతంలో రాత్రి వేళ వాహనచోదకులకు కనిపించే విధంగా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ లేదా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రమాదకర మలుపు ఉన్న ఈ కూడలిలో హైవే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

అప్రోచ్ లేక ప్రమాదాలు



కొత్త కాలువ సెంటర్‌లో రోడ్డు దాటాలంటేనే భయంగా ఉంది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఉన్న రోడ్డును తొలగించారు. రోడ్డుకు ఇరువైపుల అప్రోచ్ లేకపోవడంతో వాహనాలతో గ్రామాల్లోకి వెళ్లాలంటేనే భయంగా ఉంది. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి అనేక మంది క్షతగాత్రులయ్యారు.

– పిండి లక్ష్మణరావు, గాడిలంక.

రోడ్లు నిర్మించాలి



గ్రామాలను కలుపుతూ జాతీయ రహదారికి అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలి. లేకపోతే గ్రామాల నుంచి వచ్చే వాహనచోదకులు జాతీయ రహదారిని దాటాలంటే భయపడుతున్నారు. ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందో తెలియడం లేదు.

– బస్వా సత్యనారాయణ మూర్తి, గాడిలంక.

బియ్యంలో నాణ్యత లోపిస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చౌక డిపోల ద్వారా తెల్ల రేషన్ కార్డుల వారికి సరఫరా చేస్తున్న బియ్యంలో నాణ్యత లోపిస్తోందని వర్కర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవదుల సూర్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలోని పార్టీ జిల్లా శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పచ్చి బియ్యం సరఫరా చేయడం వల్ల పేదలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దీపావళి కానుకగా రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల కిట్లను అందించాలని డిమాండ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన కిట్లు ఈ కూటమి ప్రభుత్వంలో ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరావు, పితాని బేబీరావు, కముజు సుందరరావు, డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర్ల సంక్షేమానికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర్ తదితరులు

ముమ్మిడివరం: కుమ్మర్ల సంక్షేమ కోసం కృషి చేస్తానని శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించి కుమ్మర్ల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ముమ్మిడివరంలో కుమ్మర్ల ప్రతినిధులతో సమావేశమై కుమ్మర్ల సామాజిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఆయన మాట్లాడుతూ, కుమ్మర్లు సంప్రదాయ వస్తువులే కాకుండా ఆధునిక వస్తువులు తయారు చేయడానికి తగిన శిక్షణలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మశాన వాటిక స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కార్పొరేషన్ డైరక్టర్ విజయకుమారి, ఎస్‌వీ బ్రహ్మం, కుమ్మర్ల సమాజ ప్రతినిధులు ఉన్నారు.

మురుగు ఏడిపిస్తోంది!



నిత్యం మురికి కూపంగా దర్శనమిస్తున్న ఈదరపల్లి రోడ్డు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు నుంచి ఈదరపల్లి వంతెన రోడ్డు వరకూ ఉన్న మెయిన్ రోడ్డులో డ్రెయిన్ నిత్యం పొంగిపొర్లుతూ వాహనచోదకులు, బాటసారులకు మురుగు కంపు తప్పట్లేదు. ఈ మెయిన్ రోడ్డు అమలాపురం పట్టణ ప్రవేశంగా ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డు వెంబడి ప్రయాణిస్తాయి. రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్ వెళ్లే వాహనాలన్నీ ఈ రోడ్డు మీదుగానే వెళతాయి. ఇక అంబాజీపేట, రాజోలు, కొత్తపేట వైపు వెళ్లే కార్లు, ద్విచక్రవాహనాలు సైతం ఈ రోడ్డు మీద నుంచి ప్రయాణిస్తాయి. ఈ రోడ్డులోనే నాలుగు పెట్రోలు బంక్‌లు ఉన్నాయి. నిత్యం ఊట బావిలా రోడ్డు చెంత ఉన్న డ్రెయిన్‌లోంచి ఎక్కువ లీకేజీతో మురుగు నీరు రోడ్డును ముంచెత్తుతూనే ఉంటుంది. ఈ మెయిన్‌రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ వల్ల వాహనాల కోసం ఇన్ అవుట్ రోడ్లుగా విభజించి ఉంటుంది. అవుట్ రోడ్డు దాదాపు అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోకి, ఇన్ రోడ్డు అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. పంచాయితీ దీనిని పట్టించుకోకపోవడంతో మురికి కంపు దుస్థితి అనివార్యమైంది. ఇదే విషయాన్ని ఆ రోడ్డులో ఉన్న పెట్రోలు బంక్‌ల యాజమాన్యాలు, సిబ్బంది, వ్యాపారులు తమ ఆవేదనను ఆరోపణల రూపంలో బహిరంగంగా చెబుతున్నారు. డ్రెయిన్‌లోంచి లీకవుతున్న మురుగు నీరు రోడ్డు పొడవునా దాదాపు 150 అడుగులకు పైగా పారుతుంటుంది. ఇక వర్షం వస్తే రోడ్డు మొత్తం ముంపునకు గురై గంటల తరబడి అదే రోడ్డుపై నిలిచిపోతోంది. అదే సాధారణ రోజుల్లో డ్రెయిన్ లీకేజీతో మురికి నీరు అలా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. పంచాయతీ పాలకవర్గం, అధికారులు ఈ ప్రధాన డ్రెయిన్‌కు మరమ్మతులు తక్షణమే చేపట్టి మెయిన్‌రోడ్డులో మురికి కూపాన్ని తొలగించాలని వ్యాపారులు, వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు అనేక మంది ఈ మెయిన్‌రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్నా.. వారూ ఏ రోజూ ఈ సమస్య గురించి పట్టించుకున్న పాపాన లేదు.

బాణసంచా నిల్వలపై నిఘా బృందాలు



కొత్త మాధవి

అమలాపురం టౌన్: జిల్లాలో బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో కొత్త మాధవి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచాను నిల్వలు, విక్రయాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా షాపులు సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రానున్న దీపావళిని దృష్టిలో పెట్టుకుని బాణసంచా అక్రమ విక్రయదారులు అక్రమ నిల్వలు చేయడంతో పాటు అనుమతులు లేకుండా విక్రయించే అవకాశం ఉందన్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా బృందాలు రంగంలోకి దింపినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలు, అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించామన్నారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో దీపావళి బాణసంచా లైసెన్స్‌డ్ షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండే విధంగా, నివాస ప్రాంతాలకు కనీసం 50 మీటర్ల దూరంలో ఉండేలా అనుమతులు ఇస్తున్నామని డీఆర్వో వివరించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

తాళ్లరేవు: కత్తిపూడి నుంచి పామర్రు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 216లో కాకినాడ నుంచి ఎదుర్లంక బ్రిడ్జి వరకు నిర్మాణంలో, నిర్వహణలోనూ అనేక లోపాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఈ మేరకు ఎన్‌హెచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరరావు మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. ఈ రహదారి నిర్మాణంలో లోపాలు కారణంగా గత పదేళ్లలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిర్వహణ లోపాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే రహదారిని అన్ని రకాల సౌకర్యాలతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు

అమలాపురం టౌన్: జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగులకు జరిగిన ఎన్నికల్లో ఆ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా కలెక్టరేట్ ఏవో కె.విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో విశ్వేశ్వరావును ఉద్యోగులు ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మద్దాల బాపూజీ, కె.మల్లిబాబు, అమలాపురం తాలూకా అధ్యక్షుడు పి.కామేశ్వరరావు, రామచంద్రపురం తాలూకా అధ్యక్షుడు కొమ్ముల స్వామినాయుడు తదితరులు ఏవో విశ్వేశ్వరరావును కలెక్టరేట్‌లో కలిసి సత్కరించి అభినందించారు.

విశ్వేశ్వరరావును అభినందిస్తున్న బాపూజీ తదితరులు →



చెత్తను తరలించాలని రిలే నిరాహార దీక్ష



బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న నాయకులు తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో 12 నెలలుగా పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయం ఎదురుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చెత్తపై పోరు పేరుతో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. చెత్త పేరుకుపోయి ప్రజలు రోగలబారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ రిలే దీక్షల్లో జాన జగదీష్ చంద్ర గణేష్, సరెళ్ల రామ కృష్ణ, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఇనుమర్తి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా కేటాయించాలి

మామిడికుదురు: పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణాను మామిడికుదురు సొసైటీకి కేటాయించాలని కోరుతూ సొసైటీ చైర్మన్ యాలి శ్రీనివాస్ బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతికి వినతిపత్రం ఇచ్చారు. అమలాపురంలో జేసీని కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించిన తరువాత రాయితీ దాణాపై వినతిపత్రం ఇచ్చారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు.

పీఎం సూర్యఘర్‌కు బ్యాంకుల ఆంక్షలు

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: పీఎం సూర్యఘర్ పథకానికి బ్యాంకుల ఆంక్షలతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు కేంద్రం రాయితీపై పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని బ్యాంకులు పలు కారణలతో ఇబ్బందులు పెట్టడంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలు అందడం లేదని పలువురు అబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక జీవన విధానంలో విద్యుత్ నిత్యావసరంగా మారింది. మానవుని కార్యకలాపాలు సజావుగా సాగాలంటే విద్యుత్ సదుపాయం అనివార్యమైంది. ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్ సరఫరా స్థానంలో సోలార్ విద్యుత్ సదుపాయాన్ని వినియోగించుకునే దిశగా ప్రజలు ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అందుకు తగిన కార్యాచరణను ఆ శాఖ సిద్ధం చేసింది. ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన పథకానికి రాయితీ ప్రకటించి ప్రజలను చైతన్యవంతం చేస్తోంది.



అమలాపురంలో ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

నిబంధనల పేరుతో..

విద్యుత్ వినియోగదారు సోలార్ పథకానికి దరఖాస్తులు చేసుకుంటే పలు బ్యాంకులు ష్యూరిటీ లేకుండా రుణాలు ఇవ్వాల్సి ఉండగా పలు బ్యాంకులు నిబంధనల పేరుతో రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని అబ్దిదారులు ఆరోపిస్తున్నారు. తల్లిదండ్రుల పేరు మీద విద్యుత్ సర్వీసు ఉండటం వల్ల సర్వీసు మార్పు చేసుకోవడంలో జాప్యం, వయసు ఎక్కువ ఉన్న కారణాలతో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావట్లేదని సోలార్ కంపెనీ ప్రతినిధులు అంటున్నారు. ఇంటికి నాలుగు, ఐదు విద్యుత్ మీటర్లు ఉన్నా.. ఒకే రుణం ఇస్తామని బ్యాంకులు చెప్పడంతో ఉమ్మడి కుటుంబాల్లోని వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సివిల్ స్కోర్ సరిగాలేదని కొన్ని బ్యాంకులు తిరస్కరిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు నెలలు పూర్తైనా రుణాలు ఇవ్వడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం పట్టణంలో 283 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే 176 మంది సోలార్ పలాకలు ఏర్పాటు చేసుకున్నారు. అమలాపురం రూరల్ మండలంలో 703 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం 105 మంది మాత్రమే ఏర్పాటు చేశారు. అల్లవరంలో 623 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం 37 మంది మాత్రమే ఏర్పాటు చేశారు. ఉప్పలగుప్తం మండలంలో 254 మందికి 23 మంది ఏర్పాటుచేశారు. ముమ్మిడివరం మండలంలో 235 మందికి 123 మాత్రమే ఏర్పాటు చేశారు. ఐ.పోలవరంలో 53కి 25 మంది ఏర్పాటు చేశారు. కాట్రేనికోనలో 271 మందికి 36 మంది ఏర్పాటు చేశారు.



సూర్యఘర్ పథకంపై అమలాపురంలో ఇటీవల అవగాహన ర్యాలీ

పథకం అమలు ఇలా..

పర్యావరణ పరిరక్షణ ఆలోచనలో భాగంగా సౌర శక్తి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా సూర్యఘర్ యోజన పథకాన్ని రూపొందించింది. ఇంటి స్లాబుపై సోలార్ శక్తిని ఉత్పత్తి చేసే ఫలకాలను ఏర్పాటు చేసుకోడానికి విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ముందుగా పెట్టుబడి పెట్టిన వారికి కేంద్ర ప్రభుత్వం రాయితీతో పాటు గ్రేడ్ సరఫరా చేసిన విద్యుత్ లెక్కలు కడితే ఖర్చు చేసిన మొత్తం రెండు, మూడేళ్లలో తిరిగి వస్తుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగాన్ని బట్టి సున్నా బిల్లులు లేదా స్వల్ప చార్జీలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. సౌర విద్యుత్ నెట్ మీటర్ ఏర్పాటు చేసుకుని నేరుగా గ్రిడ్ అనుసంధానం చేయడం వల్ల నెల నెల వచ్చే బిల్లులో అమేర మినహాయింపు ఉంటుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సామర్థ్యం బట్టి రాయితీలు

ఎంత మేరకు సోలార్ విద్యుత్ వాడకం అవసరం అవుతుందోనన్న అంచనాతో కిలో వాట్ సామర్థ్యం ప్రాతిపదికన ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఎంపిక చేస్తున్న సామర్థ్యం బట్టి ఈ పథకానికి సంబంధించిన మొత్తం చెల్లించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. వినియోగదారుడు ఈ మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం ఉంది. ఒక కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ ఫలకాన్ని ఏర్పాటు చేసుకునేందుకు రూ.70 వేలు ఖర్చు అవుతుంది. దానిలో ప్రభుత్వం రూ 30.వేలు రాయితీ ఇస్తుంది. రోజుకు నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 2 కిలో వాట్లకు రూ.1.14 లక్షలు ఖర్చు కాగా, రూ.30 వేలు రాయితీ వస్తుంది. రోజుకు 8 యూనిట్లు సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 3 కిలో వాట్ సోలార్ ఫలకాలకు రూ.2.10 లక్షలు కాగా, రూ.78 వేలు రాయితీ వస్తుంది. రోజుకు 12 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది.

పథకంపై అవగాహన కల్పిస్తున్నాం



పీఎం సూర్యఘర్ పథకంపై మున్సిపల్, ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ అధికారులు, విద్యుత్ శాఖ అనుబంధ శాఖల అధికారులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు సైతం నిర్వహించాం. ప్రకృతి సిద్ధమైన సోలార్ విద్యుత్‌ను వినియోగించేందుకు ప్రజలు అలవాటు చేసుకునే ర్యాలీలు, సమావేశాలు చేపట్టాం. జిల్లాలో ఇప్పటివరకు 1,625 మంది సోలార్ ఫలకాలు వేయించుకున్నారు. దళితులకు సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉచితంగా అందజేస్తున్నారు. సొంత స్థలం లేని వారి కోసం పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలంలో అధికారుల అనుమతితో సోలార్ ఫలాకలు ఏర్పాటు చేసుకునే అవకాశాలున్నాయి.

– ఎస్.రాజేశ్వరి, జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ.

విద్యుత్ చార్జీలు తగ్గించుకోవచ్చు



కేంద్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూ.78,000 సబ్సిడీ అందిస్తుంది. విద్యుత్ వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ చార్జీలు 90 శాతం తగ్గించుకోవచ్చు. మనం వాడుకునే విద్యుత్‌ను మన ఇంటిపైన ఉత్పత్తి చేసుకుంటూ పర్యావరణాన్ని కూడ పరిరక్షించవచ్చు.

– యల్లమిల్లి కొండ, సోలార్ వెండర్, అమలాపురం.